సాక్షి వికారాబాద్

శనివారం। 18। మే। 2024



బెంగ తీర్చిన 'బేలర్'

గడ్డిని కట్టలు కట్టే యంత్రం(బేలర్) వచ్చేసింది. హార్వెస్టర్లు కోసిన గడ్డిని బేలర్ సునాయాసంగా కట్టలు కడుతుంది. 8లో▸



జిప్సం ఫ్యాక్టరీలో ప్రమాదం

జిప్సం ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. విద్యుదాఘాతంతో భారీగా మంటలు చెలరేగాయి. 8లో▸



సమస్యల తిష్ట

మార్కెట్ యార్డు పరిస్థితి దయనీయంగా మారింది. చిన్నపాటి వర్షానికే అస్తవ్యస్తంగా తయారయింది. 9లో▸

న్యూస్‌రీల్

బీఏఎస్ఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: జిల్లాలోని షెడ్యూలు కులాల విద్యార్థులు ఇంగ్లిష్ మాధ్యమంలో చదువుకునేందుకు అర్హులైన వారినుంచి బీఏఎస్ఎస్(బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం)లో భాగంగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికిగాను 1వ తరగతి ప్రవేశాలకు వికారాబాద్, తాండూరు, పరిగి, కుల్కచర్ల ప్రైవేట్ స్కూల్స్‌లో 88(డే స్కాలర్), 5వ తరగతి ప్రవేశాలకు (రెసిడెన్షియల్) కుల్కచర్ల ప్రైవేట్ స్కూల్‌లో 91 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 2024 ఏప్రిల్ 1నాటికి గ్రామీణ ప్రాంతంలో నివసించే వారి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంత నివాసితుల వార్షికాదాయం రూ.2లక్షలు మించరాదన్నారు. మీ సేవా నుంచి తీసుకున్న కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు(ఉన్నట్లైతే), రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను దరఖాస్తుకు జతచేయాలన్నారు. కలెక్టరేట్ ఆవరణలోకి షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో మే 18 నుంచి దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. జూన్ 7 సాయంత్రం ఐదు గంటలలోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థుల కుటుంబ సభ్యుల్లో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో గాని గతంలో బీఏఎస్ఎస్‌లో చదువుకున్నవారుంటే దరఖాస్తుకు అవకాశం లేదని చెప్పారు. 1వ తరగతి దరఖాస్తుదారులు 2018 జూన్ 1 నుంచి 2019 మే 31 మధ్యలో జన్మించిన వారే అర్హులన్నారు. పూర్తి వివరాలకు 9908690240 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఎస్పీకి అభినందనల వెల్లువ



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా పోలీస్ సంఘం సభ్యులు

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు అశోక్, సభ్యులు ఎస్పీ కోటిరెడ్డికి అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అందరి సమన్వయంతోనే ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ డేవిడ్, అంజద్ పాషా తదితరులున్నారు.

పౌల్ట్రీ రైతులకు ఆస్తిపన్ను మినహాయించండి



షాద్‌నగర్: పౌల్ట్రీ రైతులకు ప్రభుత్వం విధించిన ఆస్తిపన్నును మినహాయించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం నగరంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి వినతిపత్రం సమర్పించారు. పౌల్ట్రీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పాత బకాయిల వసూలు కోసం మున్సిపల్ పరిధిలో ఉండే పౌల్ట్రీ రైతులకు జారీ చేసిన ఆదేశాలను రద్దు చేయాలని కోరారు. పౌల్ట్రీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

ఫలితాల్లో వెనుకంజ

ఉన్నత విద్యలో పడిపోతున్న ఉత్తీర్ణత

- విద్యాశాఖ పనితీరుపై విమర్శలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు
- పదిలో చివరి స్థానం
- సరిపడా స్టాఫ్ ఉన్న పాఠశాలల్లోనూ రిజల్టు 50శాతమే
- ఇప్పటికీ సమీక్షించని జిల్లా యంత్రాంగం



వికారాబాద్: పది, ఇంటర్ ఫలితాల్లో జిల్లా వెనుకబాటుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యాశాఖ పనితీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు, విద్యావేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉమ్మడి జిల్లాల వారీగా ఫలితాలు వచ్చేవి. రంగారెడ్డి అర్బన్ ఏరియాతో కలిపి ఫలితాలు వస్తుండడంతో మన ప్రాంతం సైతం తొలి ఐదో స్థానంలో నిలిచేది. జిల్లాల పునర్విభజన అనంతరం జిల్లాలో కరోనా బ్యాచ్‌లు మినహాయిస్తే పది, ఇంటర్ ఫలితాల్లో 20లోపు నిలిచిన దాఖలాలు లేవు. ఈ ఏడాదైతే ఫలితాల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఇంటర్మీడియెట్ మొదటి ఏడాది ఫలితాల్లో 22వ స్థానం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 27వ స్థానానికి పరిమితమైంది. పది ఫలితాల్లో రాష్ట్రంలో చివరిస్థానానికి పడిపోయింది. దీంతో జిల్లా యంత్రాంగం, ఉన్నతాధికారులు, విద్యాశాఖ తలదించుకోవాల్సిన దుస్థితి. ఇంత జరిగినా జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు సైతం సమీక్షించిన దాఖలాలు లేవు. అకడమిక్ సంవత్సరమంతా పర్యవేక్షణ గాలికొదిలేసి పరీక్షల నిర్వహణపై మాత్రమే దృష్టి సారించడంతో ఈ ఫలితాలే పునరావృతమవుతాయని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పర్యవేక్షణ లోపమే కారణం

ఈ వైఫల్యానికి ప్రధాన కారణం పర్యవేక్షణలోపమే అంటున్నారు. అధికారుల కొరతతో పాటుగా ప్రధానోపాధ్యాయులు తరగతిగదుల పర్యవేక్షణను గాలికొదిలేసారనే అపవాదు ఉంది. వారంలో ఎనిమిది పీరియడ్స్ బోధనతో పాటుగా ఐదు పీరియడ్స్ పర్యవేక్షించాలి. విద్యార్థులు సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలలు సైతం ఫలితాల్లో అట్టడుగున నిలవడం విద్యాశాఖ పనితీరును ప్రశ్నిస్తోంది. సరిపడా స్టాఫ్ ఉన్న పాఠశాలల్లోనూ 50 శాతం లోపు ఫలితాలు రావడం.. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుడు ఒకరి చొప్పున కూడా ఉత్తీర్ణత సాధించలేకపోవడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఫలితాల వివరాలు

తరగతి	హాజరైనవారు	ఉత్తీర్ణులు	ఫెయిల్	ఉత్తీర్ణత శాతం	జిల్లా స్థానం
పదో తరగతి	13,357	8,695	4,262	65.10	చివరి
ఇంటర్ మొదటి ఏడాది	6,445	3,428	3,027	53.11	22వ
ద్వితీయ సంవత్సరం	6,456	3,965	2,491	61	27వ

పాఠశాలల వారీగా ఫలితాలు

పాఠశాల	విద్యార్థులు	ఉత్తీర్ణులు	ఫెయిల్యూర్స్	ఉత్తీర్ణతశాతం
తాండూరు జెడ్పీ	36	12	24	33
ఇందిరానగర్ జెడ్పీ	16	03	13	18
మల్లారెడ్డిపల్లి జెడ్పీ	48	12	36	25
ధారూరు కేజీబీవీ	41	13	28	31
బషీరాబాద్ కేజీబీవీ	70	12	58	17
ఆలంపల్లి జెడ్పీ(ఉర్దూ)	24	07	17	29
చౌడాపూర్ జెడ్పీ	87	26	61	20
పులుసుమామిడి జెడ్పీ	05	01	04	20
మోమిన్‌పేట జెడ్పీ	34	07	27	20
తొర్మామిడి జెడ్పీ	21	04	17	19



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

'ఆదర్శ' పనులు వేగిరం

అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

అనంతగిరి: జిల్లా పరిధిలోని ఆదర్శ పాఠశాలల్లో పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. శుక్రవారం సీఎస్ శాంతకుమారి సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వికారాబాద్ జిల్లా కలక్టరేట్ నుంచి అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ శర్మ ముఖ్యమంత్రి ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం, ధరణి సమస్యల పరిష్కారానికి చొరవతీసుకుంటున్నామన్నారు. ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి నాణ్యతాలోపం లేకుండా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. యూనిఫాంలు కుట్టే పనులు చివరిదశకు చేరుకున్నాయన్ని వివరించారు. కాన్ఫరెన్స్ అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ.. ధరణి, ముఖ్యమంత్రి ప్రజావాణి దరఖాస్తులను పరిష్కారం దిశగా పనిచేయాలని సూచించారు. సీఎం ప్రజావాణిలో జిల్లాకు 768 దరఖాస్తులు వచ్చాయని ఇందులో 722 దరఖాస్తులను సంబంధిత శాఖలకు సమర్పించామన్నారు. సంబంధింత శాఖలకు వచ్చిన దరఖాస్తుల స్టేటస్‌ను పోర్టల్ లో అప్‌డేట్ చేయాలన్నారు. వివరాల కాపీలను కలెక్టర్‌కు సమర్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యాన్ని సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ సుగుణ బాయి, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీసీఓ ఈశ్వరయ్య, డీఎల్‌పీఓ సంధ్యారాణి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

అమ్మ ఆదర్శ పాఠశాలలో మే 30లోగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. శుక్రవారం ఆయన వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొంపల్లి ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ మాసంలో పాఠశాలలు తెరుచుకునేప్పటికి అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యత లోపం ఉండొద్దన్నారు. ఆదర్శ పాఠశాలల్లో కలర్స్ వేయడం, టాయిలెట్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ తదితరులు ఉన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత పరిశీలన

చేవెళ్ల: చేవెళ్ల లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను వెబ్ క్యాస్టింగ్ స్క్రీనింగ్ ద్వారా రాష్ట్ర ఎన్నికల సంఘం అడిషనల్ సీఈఓ లోకేష్‌కుమార్ పరిశీలించారు. గొల్లపల్లి సమీపంలో ఉన్న బండారు శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచిన ఈవీఎంల స్ట్రాంగ్‌రూంను శుక్రవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంకతో కలిసి ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్ రూం వద్ద ఏర్పాటు చేసిన భద్రతను పర్యవేక్షించారు. వెబ్‌క్యాస్టింగ్ స్క్రీనింగ్ ద్వారా ఒక్కో నియోజకవర్గం స్ట్రాంగ్ రూం, వాటికి వేసిన సీళ్లను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారి వెంట చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం, తహసీల్దార్లు వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



తాండూరు రైల్వే స్టేషన్ పనులను పరిశీలిస్తున్న భర్తేశ్‌కుమార్ జైన్

పది నెలల్లో ఆధునికీకరణ పూర్తి

సికింద్రాబాద్ డీఆర్‌ఎం భర్తేశ్‌కుమార్ జైన్

తాండూరు: పది నెలల్లో తాండూరు రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామని రైల్వేశాఖ సికింద్రాబాద్ డీఆర్‌ఎం(డివిజినల్ రైల్వే మేనేజర్) భర్తేశ్‌కుమార్ జైన్ అన్నారు. శుక్రవారం ఆయన తాండూరు రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా తాండూరు రైల్వే స్టేషన్ రూ.25కోట్ల నిధులతో ఆధునికీకరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులను శుక్రవారం భర్తేశ్‌కుమార్ జైన్ రైల్వే శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన డీఆర్‌ఎం మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పనులు చేపడుతున్నామని వివరించారు. తాండూరు రైల్వే స్టేషన్‌లో ఎస్కలేటర్, టాయిలెట్స్, విశ్రాంతి గదులు, స్టేషన్ ఎదుట వాహనాల పార్కింగ్ ప్రాంగణం పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. అభివృద్ధి పనులతో ప్రయాణికులు ఇబ్బంది కలుగుతోందని కొంతకాలం సహకరించాలని కోరారు.

హార్డ్‌వేర్ షాపులో భారీ అగ్నిప్రమాదం

- షార్ట్ సర్క్యూట్‌తో కాలిబూడిదైన సామగ్రి
- రూ.3కోట్లకు పైగా ఆస్తినష్టం

అనంతగిరి: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ హార్డ్‌వేర్ దుకాణంలో మంటలు చెలరేగి సుమారు రూ.3 కోట్లకు పైగా ఆస్తి నష్టం సంభవించింది. రెండో అంతస్తులో చిక్కుకున్న వృద్ధురాలు, ఇద్దరు చిన్నారులను ఫైర్ సిబ్బంది సురక్షితంగా బయటకు దించారు. ప్రమాదంలో సుమారు రూ.3 కోట్లకు పైగా ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు నేనావత్ కృష్ణ వాపోయాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. ధారూరు మండలం నాగారానికి చెందిన కృష్ణ వికారాబాద్ పట్టణం రామయ్యగూడ రోడ్డులోని తమ సొంత నివాసంలో హార్డ్‌వేర్ షాపు నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం రాత్రి దుకాణం మూసేసి.. ఇదే భవనంలోని మొదటి అంతస్తులో నిద్రపోయాడు. తెల్లవారుజామున 3.30గంటల ప్రాంతంలో షాపులో నుంచి మంటలు రావడాన్ని గమనించిన కృష్ణ దంపతులు భయంతో కిందకు వచ్చారు. పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు బయటకు వచ్చి ఫైర్, పోలీసు సిబ్బందికి సమాచారం అందించారు. వికారాబాద్ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ వెంకటరమణారెడ్డి, టౌన్ సీఐ నాగరాజు హుటాహుటిన తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. వికారాబాద్‌కు చెందిన ఫైరింజన్‌తో ఎంతగా ప్రయత్నించినా మంటలు అదుపులోకి రాలేదు. దీంతో పరిగి నుంచి మరో ఫైరింజన్‌ను తెప్పించారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల మంటలను ఆర్పేందుకు యూజీడీ ట్యాంకర్, వాటర్ ట్యాంకర్లు పంపించారు. పలువురు మున్సిపల్ సిబ్బంది సైతం సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

నిచ్చెన సాయంతో కిందికి..

రెండో అంతస్తులో నిద్రిస్తున్న కృష్ణ తల్లి నాగిబాయి, పిల్లలు జయశ్రీ, శ్రీనిత్య అక్కడే చిక్కుకున్నారు. భవనం ముందు భాగం నుంచి మంటలు ఉవ్వెత్తున ఎగిసి పడటంతో.. ల్యాడర్ సాయంతో వెనక వైపు నుంచి రెండో అంతస్తులోకి వెళ్లిన ఫైర్ సిబ్బంది ముగ్గురినీ సురక్షితంగా కిందకు దించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కన్నీరుమున్నీరైన బాధితులు

ఎగిసిపడుతున్న మంటలను చూసి దుకాణ నిర్వాహకులు, కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. కళ్ల ఎదుటే దుకాణం కాలిపోతుంటే గుండెలు బాదుకున్నారు. షాపులో సుమారు రూ.2 కోట్ల విలువైన సామగ్రి, బిల్లులు చెల్లించేందుకు దాచిన రూ.10 లక్షలు అగ్నికి ఆహుతయ్యాయని, రూ.కోటికి పైగా విలువైన భవనం పనికి రాకుండా పోయిందని వాపోయారు.

ముమ్మరంగా సహాయక చర్యలు

భారీగా ఎగిసి పడిన మంటలు చుట్టు పక్క భవనాలకు సైతం తాకడంతో పక్కవాళ్లు భయపడ్డారు. రెండు ఫైరింజన్లు, మున్సిపల్ ట్యాంకర్లు, యూజీడీ ట్యాంక్ మంటలు ఆర్పుతుండగా, ఫైర్, పోలీస్, మున్సిపల్ సిబ్బంది, స్థానికులు సుమారు ఐదు గంటల పాటు సహాయక చర్యలో పాల్గొనడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. జిల్లా ఫైర్ అధికారి కిశోర్ ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, టౌన్ సీఐ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఫైర్ అధికారులు వెంకటరమణారెడ్డి, గురువారెడ్డి తదితరులు దగ్గరుండి ప్రమాద తీవ్రతను అరికట్టగలిగారు.

ఆర్థికసాయం

మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ సురేశ్, పలువురు వ్యాపారవేత్తలు బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. ప్రమాద విషయాన్ని స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు తెలియజేశామని, ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు కృషి చేస్తామని ధైర్యం చెప్పారు.



చిన్నారిని కిందికి తీసుకువస్తున్న సిబ్బంది



ఎగిసిపడుతున్న మంటలు



బాధిత కుటుంబీకులను ఓదారుస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దండి

- కేంద్ర జలశక్తి అభియాన్ గ్రౌండ్ వాటర్ సైంటిస్ట్ సత్యకుమార్
- దాదాపూర్ పంచాయతీలో కేంద్ర బృందం పర్యటన



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న కేంద్ర జలశక్తి అభియాన్ సభ్యులు

దోమ: గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని కేంద్ర జలశక్తి అభియాన్ గ్రౌండ్ వాటర్ సైంటిస్ట్ సత్యకుమార్, సర్ఫేస్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి శ్రుతి అన్నారు. శుక్రవారం వారు కేంద్రం బృందంతో కలిసి మండల పరిధిలోని దాదాపూర్ పంచాయతీలో పర్యటించారు. నేషనల్ పంచాయతీ అవార్డుకు దాదాపూర్ పంచాయతీ ప్రతిపాదనలు పంపడంతో శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌తో కలసి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ఫాంపాండ్, ఫిష్ పాండ్, ఎంఐ థాంక్స్, కమ్యూనిటీ సోక్‌పిట్స్, మ్యాజిక్ సోక్‌పిట్స్, హరితహారం, నర్సరీ, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. నీటి వినియోగం, నిల్వలు, వాటి ప్రాముఖ్యతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీ కూలీలతో మాట్లాడి పనులపై ఆరా తీశారు. ప్రతీ ఇంటి ఎదుట ఇంకుడు గుంతల నిర్మాణం ఉండాలన్నారు. కమ్యూనిటీ ఇంకుడు గుంతలతో పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని చెప్పారు. గ్రామంలో పనులు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. ప్రతీ పనిని ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పూర్తి చేసేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహేశ్‌బాబు, ఎంపీఓ సోమలింగం, ఏపీడీ సరళ కుమారి, ఏపీఓ దస్తయ్య, పంచాయతీ కార్యదర్శులు రవీందర్‌రెడ్డి, వినోద్, రాజేశ్, వెంకటనర్సింహులు, మోహన్, సంతోషి, అన్నపూర్ణ, టెక్నికల్ అసిస్టెంట్‌లు నారాయణరెడ్డి, బాలయ్య, శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ మొగులయ్య, అంబయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

అడిషనల్ డీఆర్‌డీఓ సరోజ



యునిఫామ్ తయారీ పనులను పరిశీలిస్తున్న అధికారులు

దోమ: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని అడిషనల్ డీఆర్‌డీఓ సరోజ ఆకాంక్షించారు. దోమ మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవన్‌లో యూనిఫాం తయారీ విధానాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వమే యూనిఫాంలను అందజేస్తుందన్నారు. ఆయా యూనిఫామ్‌లను మహిళలు స్వయం ఉపాధి సంఘాల ద్వారా రుణాలను తీసుకొని.. కుట్టు మిషన్లు ఏర్పాటు చేసుకొని కుడుతున్నారని తెలిపారు. తద్వారా వచ్చే డబ్బులతో ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీపీఎం రామ్మూర్తి, ఏపీఎం సురేశ్, సీసీలు జంగయ్య, సుజ్ఞాణి, నారాయణ, వీఓఏలు, మహిళా సంఘం అధ్యక్షురాలు జ్యోతి, కార్యదర్శి అమృతమ్మ, కోశాధికారి రాధ, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న జయకృష్ణ

బొంరాస్‌పేట: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరిధాన్యం వర్షాలకు తడవకుండా చర్యలు తీసుకోవాలని మెట్లకుంట పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ సూచించారు. శుక్రవారం బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని రేగడి మైలారం, చిల్మల్‌మైలారం, దుద్యాల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ధాన్యాన్ని విక్రయించడంలో రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు రానివ్వొద్దని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లోని రికార్డులను ఆయన పరిశీలించారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కేశంపేట: రికార్డులను తారుమారు చేసి ప్రభుత్వ భూమిని పట్టాభూమిగా మార్చుకొని అమ్మకానికి పెట్టిన రికార్డులను పరిశీలించి, పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించాలని కోరుతూ శుక్రవారం దత్తాయపల్లికి చెందిన పలువురు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని దత్తాయపల్లి రెవెన్యూ శివారులోని సర్వేనంబర్ 27లో 3ఎకరాల 16గుంటల భూమి ఖాస్రా, చేసాలాతో పాటు పలు రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదైనట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ భూమిని పట్టాభూమిగా మార్చుకొని అమ్మకానికి పెట్టారని తెలిపారు.

బావిలో గల్లంతైన వ్యక్తి

మృతదేహం లభ్యం

మాడ్గుల: బావిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మాడ్గుల మండలం నర్సాయిపల్లికి చెందిన బైకని కొమరయ్య(40) గురువారం మధ్యాహ్నం కోల్కులపల్లి గ్రామంలోని ఓ బావిలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు బావిలో గాలింపు చర్యలు చేపట్టారు. మొదటి రోజు ఆచూకీ లభించలేదు.. రెండో రోజు గజఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమించి మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు సీఐ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18K ఫోన్: 9160900024/9640400073 [H-799880]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాం. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రైతన్న బెంగ తీర్చిన 'బేలర్'

యంత్రాలతో వరిగడ్డి కట్టలు

- ఒకరోజులో పదెకరాల విస్తీర్ణంలోని పశుగ్రాసాన్ని కట్టలు కట్టే సామర్థ్యం
- సమయం, ఖర్చు ఆదా
- ఆసక్తి చూపుతున్న రైతులు
- ప్రభుత్వం సబ్సిడీపై అందించాలని వినతి



వరిగడ్డిని కట్టలు కడుతున్న బేలర్ యంత్రం

దోమ: గతంలో రైతులు పొలాన్ని కొడవలితో కోసి, కల్లం చేసి, గడ్డిని వాములు వేసుకునేవారు. రైతు బతికేందుకు పంట పండించుకున్నట్టే..రైతుకు చేదోడు, వాదోడుగా ఉండే పశువుల కోసం వరిగడ్డిని నిల్వ చేసుకునేవారు. తదనంతర కాలంలో హార్వెస్టర్లు వచ్చి సగం పని తప్పించినా.. కోసిన గడ్డి కుప్పలు పెట్టుకునేందుకు రైతులకు ఇబ్బందిగా ఉండేది. కుప్పలు పెట్టుకునేందుకు స్థలం కూడా ఎక్కువగా కావాల్సి వస్తుండేది. అయితే ప్రస్తుతం వ్యవసాయ రంగంలో వస్తున్న యాంత్రీకరణతో రైతులకు శ్రమ, సమయం రెండూ తగ్గుతున్నాయి. గడ్డిని కుప్పలు చేసి మోపులు పెట్టి వాము పేర్చే పనిలేకుండా గడ్డి కట్టలు కట్టే యంత్రం(బేలర్) వచ్చేసింది. హార్వెస్టర్లు కోసిన గడ్డిని బేలర్ సునాయాసంగా కట్టలు కడుతుంది. దీంతో రైతులు గడ్డికట్టలను తీసుకెళ్లి తక్కువ స్థలంలో భద్రపర్చుకునే అవకాశం ఉంది.

బేలర్ పనితీరు..

సాధారణంగా రైతులు వినియోగించే ట్రాక్టర్‌కు బేలర్ యంత్రాన్ని హైడ్రాలిక్ సిస్టంతో అమర్చుతారు. ఈ యంత్రం పొలంలో హార్వెస్టర్ కోసిన గడ్డిని పికప్ యూనిట్ ద్వారా తీసుకొని గడ్డిని కట్టగా తయారు చేస్తోంది. కట్ట తయారయ్యాక యంత్రంలోని ఒక భాగంలో ఉండే దారంతో కట్టను గట్టిగా కడుతుంది. ఇదంతా యంత్రంపై బిగించిన బేల్ ఇండికేటర్ ద్వారా తెలుసుకోవచ్చు. కట్ట తయారు కాగానే కంట్రోల్ బాక్స్‌లో లైట్ వెలుగుతుంది. తర్వాత కంట్రోల్ బాక్సులో ఉన్న బెల్ ఎజెక్షన్ స్విచ్ నొక్కి డ్రైవర్ బేలర్ యంత్రంలోని గడ్డికట్టను బయటకు పంపుతాడు. ఎన్ని కట్టలు తయారయ్యాయనే విషయం కూడా బేల్ కంట్రోల్ బాక్సులో స్క్రీన్‌పై కనపడుతుంది. ఒక్క గడ్డికట్ట కట్టడానికి యంత్రం యజమాని రూ.30 నుంచి రూ.35 తీసుకుంటున్నారు. అయితే ఇందులో రెండు రకాల కట్టలు కట్టే యంత్రాలు ఉంటాయి. ఒకటి రౌండ్‌గా చుట్టేది, మరొటి చతురస్రాకారంలో చుట్టేది ఉంటుంది.

పశు సంపదను పెంచుకునే దిశగా..

దోమ మండలంలో మెజార్టీ రైతులు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అయితే గతంలో ఎకరా వరిపంట విస్తీర్ణంలో పశుగ్రాసానికి కుప్పగా మార్చడానికి కూలీలకు సుమారు రూ.వేలు ఖర్చు అయ్యేది. ప్రస్తుతం వరి కట్టలు కట్టే యంత్రాలు మార్కెట్‌లో అందుబాటులోకి రావడంతో కట్టకు రూ.35 చొప్పున ఒక్కరోజులో పది ఎకరాల విస్తీర్ణంలో పశుగ్రాసాన్ని బేలర్ కట్టలు కడుతోంది. దీంతో రైతులకు సమయంతో పాటు ఖర్చు సైతం తగ్గుతోంది. వాటితో పాటు ఒక్కోసారి అదే ట్రాక్టర్‌లో సుమారుగా ఐదెకరాల పశుగ్రాసాన్ని తరలించేందుకు వీలుగా ఉంటుంది. గతంలో ఎండిన పశుగ్రాసాన్ని కేవలం ఒకే ట్రాక్టర్‌లో నిలువ చేయడానికి తరలించేవారు. దీంతో ఖర్చు పెరగగా, కొందరు రైతులు పశువులను సాకలేక అమ్ముకున్న దాఖలాలు ఉండేవి. బేలర్ రాకతో పశుగ్రాసం విలువ సామర్థ్యం పెరగడంతో తిరిగి రైతులు పశుసంపదను పెంచుకునే ఆలోచన దిశగా ముందుకు సాగుతున్నారు. ఇలాంటి యంత్రాలను ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తే ఎంతో మేలు చేకూరుతుందని రైతులు భావిస్తున్నారు.

ఖర్చు తగ్గింది



పశుగ్రాసం కోత, కుప్పలు పోయడం కోసం గతంలో చాలా ఖర్చయ్యేది. ప్రస్తుతం బేలర్ మిషన్ యజమానులు ఒక్కో కట్ట కట్టేందుకు రూ.35 తీసుకుంటున్నారు. గతంలో గడ్డి కోసి కుప్పలు పోయడం కోసం ఇచ్చే కూలీలతో పోలిస్తే ప్రస్తుతం యంత్రాల వాడకంతో ఖర్చులు బాగా తగ్గాయి. పశుగ్రాసం సైతం సమయానికి దొరుకుతోంది.

– బాబు, రైతు, బొంపల్లి

సబ్సిడీపై అందించాలి



గత కొన్నేళ్లుగా సబ్సిడీ యంత్రాలు లేక రైతులు అవస్థలుపడుతున్నారు. కిరాయియంత్రాలతో వ్యవసాయ పనులు చేయించడం ద్వారా ఖర్చులు పెరుగుతున్నాయి. రైతులకు హార్వెస్టర్, బేలర్ తదితర యంత్రాలను ప్రభుత్వం సబ్సిడీపై అందించాలి.

– అనంతయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు, దోమ

కబళించిన మృత్యువు

- వివాహానికి వెళ్తుండగా పల్టీకొట్టిన ఆటో
- ఒకరి దుర్మరణం, నలుగురికి గాయాలు
- మోమిన్‌పేట సమీపంలో ఘటన



నర్సింహులు (ఫైల్)

మోమిన్‌పేట: బంధువుల వివాహానికి వెళ్తూ ఓ వ్యక్తి మృత్యు ఒడిలోకి వెళ్లిన విషాదకర సంఘటన మోమిన్‌పేటలో చోటుచేసుకొంది. ఎస్‌ఐ అరవింద్ తెలిపిన వివరాలు.. పెద్దేముల్ మండలం మారెపల్లికి చెందిన మొగుడంపల్లి నర్సింహులు(40) తన బంధువైన మోమిన్‌పేట మండలం కేసారం గ్రామానికి చెందిన గడ్డమీది బాలయ్య కుమారుడి వివాహానికి శుక్రవారం ఉదయం బయలు దేరాడు. మధ్యాహ్నం మోమిన్‌పేటకు చేరుకోగా.. అక్కడి నుంచి బీకేఆర్ ఫంక్షన్ హాల్‌కు వెళ్లేందుకు ఆటోలో ఎక్కాడు. ఆయనతో పాటు బంటార్వం మండలం రోంపల్లికి చెందిన సుగుణమ్మ, కోటపల్లి మండలం జిన్నారం గ్రామానికి చెందిన అనంతయ్య, అనసూయ, బషీరాబాద్ మండలం బహదూర్‌పూర్‌కి చెందిన నర్సప్ప ఆటోలో ఉన్నారు. ఈ క్రమంలో ఆటో డ్రైవర్ రాములు ఆటోను అజాగ్రత్తగా నడిపడంతో మోమిన్‌పేట సమీపంలోని అనంతగిరి ఫ్యాక్టరీ వద్ద పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో నర్సింహులు అక్కడికక్కడే మృతి చెందిగా ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతుడికి భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు.

ఉపాధి హామీ పనులు భేష్

ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారిణి

నవాబుపేట: ఉపాధి హామీ పనులు, పని ప్రదేశంలో కూలీల కోసం సౌకర్యాలు బాగా ఉన్నాయని ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారిణి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె నవాబుపేట మండలం చిట్టిగిద్ద గ్రామంలో పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించారు. అనంతరం కూలీలతో ఆమె మాట్లాడారు. వారంలో ఎన్నిరోజులు పనిచేస్తున్నారు, ఉదయం ఎన్ని గంటలకు వచ్చి ఎన్ని గంటలకు తిరిగి ఇంటికి వెళుతున్నారు, ఏఏ పనులు చేస్తున్నారు,, కూలీ డబ్బులు ఎప్పుడు వస్తున్నాయి, సకాలంలో డబ్బులు వస్తున్నాయా తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ అజయ్ కుమార్, ఏపీఓ లక్ష్మీదేవి, ఈసీ జ్యోతి, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు ఉన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారిణి

జిప్సం ఫ్యాక్టరీలో షార్ట్ సర్క్యూట్



ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న దట్టమైన పొగ

- కాలిబూడిదైన సామగ్రి, ఫార్మా వేస్టేజీ
- భారీగా ఆస్తినష్టం
- ఏడాదిన్నరలో రెండో ప్రమాదం

తాండూరు రూరల్: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ జిప్సం ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గుంతబాసుపల్లి శివారులోని ఇండస్ కెమ్ జిప్సం ఫ్యాక్టరీలో గురువారం అర్ధరాత్రి విద్యుదాఘాతంతో మంటలు చెలరేగాయి. గమనించిన కార్మికులు వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. కొడంగల్, వికారాబాద్ ఫైర్ సిబ్బంది ఫైర్ ఇంజిన్‌లతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు యత్నించారు. అప్పటికే ఫ్యాక్టరీలోని మూడు జేసీబీలు, మోటార్లు, బ్లోయర్స్, ప్యానల్ బోర్డులు, కేబుల్స్ దగ్ధమయ్యాయి. దీంతో పాటుగా ఫ్యాక్టరీలో ఉన్న ఫార్మా వేస్టేజీ సైతం కాలిబూడిదయ్యింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు, దట్టమైన పొగ, దుర్వాసన వెలువడటంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆందోళన చెందారు. యేడాదిన్నర క్రితం కూడా ఇదే ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం జరిగి భారీ నష్టం వాటిల్లింది. అనంతరం మరమ్మతులు చేయించి ఫ్యాక్టరీని కొనసాగించారు. ఇప్పుడు జరిగిన ప్రమాదంలో కూడా భారీగా నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.

న్యాయం చేయండి సారూ..



యాచారం ఠాణా ఎదుట ఆందోళన చేస్తున్న అంతయ్య కుటుంబ సభ్యులు

- సిమెంట్ లారీ ఢీకొనడంతో వ్యక్తి దుర్మరణం
- పీఎస్ ఎదుట కుటుంబ సభ్యుల ధర్నా
- సీఐ జోక్యంతో సద్దుమణిగిన సమస్య

యాచారం: ఓ వ్యక్తి మృతికి కారణమైన ఓ ప్రైవేట్ కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు శుక్రవారం యాచారం పోలీస్ స్టేషన్, సాగర్‌రోడ్డుపై బాధితులు ధర్నా చేశారు. వివరాలు.. మాల్ మార్కెట్‌లో గురువారం ఉదయం ఓ సిమెంట్ లారీ ఢీకొని నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం కుదబక్షాపల్లికి చెందిన అంతయ్య తీవ్ర గాయాలై మృతి చెందాడు. ప్రమాదం జరిగిన మరుసటి రోజువరకు కంపెనీ ప్రతినిధులు ఎవరూ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి రాలేదు. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన అంతయ్య కుటుంబ సభ్యులు, బంధువులు శుక్రవారం మధ్యాహ్నం యాచారం పోలీస్ స్టేషన్ ఎదుట ఉన్న సాగర్ రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. దళిత కుటుంబానికి చెందిన అంతయ్య కష్టజీవి అని.. అతడి మృతికి కారణమైన సిమెంట్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంతో పాటు మృతుడి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వారు రోడ్డుపై బైఠాయించడంతో ఇరు వైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. సీఐ శంకర్‌కుమార్ వారికి నచ్చజెప్పి సిమెంట్ కంపెనీపై చర్యలు తీసుకోవడంతో పాటు న్యాయం చేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం కుటుంబ సభ్యులు అంతయ్య పోస్టుమార్టానికి ఒప్పుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఇంటర్నేషనల్ పాఠశాల సీఈఓ యశస్వి

మొయినాబాద్‌రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాల సీఈఓ మల్కా యశస్వి, ఎడ్యూకేషన్ సొసైటీ డైరెక్టర్ జోహార్‌లు అన్నారు. మండలంలోని హిమాయత్‌నగర్ గ్రామ సమీపంలో గల పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాలలో పచ్చదనం, పరిశుభ్రత అనే కార్యక్రమంతో పాటు విద్యార్థులకు మొక్కలు, గోల్డ్ మెడల్ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదవ తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులందరికి మొక్కలు పంపిణీ చేసి ప్రతి ఒక్కరూ విధిగా పెంచాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నూయా, అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

నందిగామ: మండల పరిధిలోని రంగాపూర్ గ్రామ శివారులోని ఓ చెరువులో నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే విషయమై శుక్రవారం సాక్షి దినపత్రికలో 'మట్టి దందా' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. శుక్రవారం ఇరిగేషన్ ఏఈ రవీందర్ రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ చెరువును సందర్శించారు. అనంతరం ఏఈ మాట్లాడూతూ.. చెరువులో నుంచి అక్రమంగా మట్టిని తవ్వి తీసుకెళ్లినట్లు తేలిందని.. ఎవరు తీసుకెళ్లారనే విషయంపై పూర్తి విచారణ చేపడతమాన్నారు. ఈ విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. అనుమతులు లేకుండా చెరువులు, కుంటల్లో నుంచి ఎట్టి పరిస్థితుల్లో మట్టిని తరలించవద్దని, ఒక వేళ తరలించినట్లయితే చట్ట పరమైన చర్యలు ఎదుర్కోవల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

ప్లాంట్‌ను తొలగించండి

కొత్తూరు: నిత్యం దుర్వాసన వెదజల్లే ఆయిల్ ప్లాంట్‌ను తమ ఇళ్ల సమీపం నుంచి తొలగించాలని కొత్తూరు తండావాసులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తండాకు సమీపంలో సర్వే నంబర్లు 52, 72లోని కొంత భూమిలో గతేడాది తారురోడ్డు వేయడంలో ఉపయోగించే ఓ ఆయిల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆ ప్లాంట్ నుంచి నిత్యం విపరీతమైన దుర్వాసన వెలువడుతుందన్నారు. ఆ దుర్వాసన పీల్చుడంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నట్లు తెలిపారు. అలాగే, సమీప పొలాలు కలుషితం అయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ప్లాంట్‌ను తొలగించాలని లేని పక్షంలో ఆందోళనలు చేపట్టతామని హెచ్చరించారు. ఈ విషయమై కొత్తూరు మున్సిపల్ కమిషనర్ బాలాజీను వివరణ కోరగా ఆయిల్ ప్లాంట్ ఏర్పాటు కోసం మున్సిపాలిటీ, ఇతర శాఖల నుంచి నిర్వాహకులు ఎలాంటి అనుమతులు తీసుకోలేదన్నారు. నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తండావాసులు ఆంజనేయులు నాయక్, బాలు నాయక్, రమేశ్, సోంప్ల, గోవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు తండా సమీపంలోని ఆయిల్ ప్లాంట్

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

ప్రిన్సిపాల్ డాక్టర్ అనూప్ శర్మ



సాత్వికోరెడ్డి

షాబాద్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ అనూప్ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆరవ జాతీయ స్కేటింగ్ ఛాంపియన్ పోటీలకు సాత్విక్‌రెడ్డి ఎంపిక కావడంతో కోచ్ కె. మొంగ్యా నాయక్, పాఠశాల యాజమాన్యం, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన గుర్రాల విష్ణువర్ధన్ రెడ్డి కుమారుడు గుర్రాల సాత్విక్‌రెడ్డి బండ్లగూడలోని శ్రీ విద్యారన్య ఇంటర్నేషనల్ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. పాఠశాల తరపున 9 నుంచి 11 సంవత్సరాల కేటగిరీలో ఆరవ జాతీయ స్కేటింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ప్రతిభను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇచ్చి పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. సహకరిస్తున్న తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కోచ్ మొంగ్యానాయక్ మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ఉల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చన్నారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటేనే విజయం వరిస్తుందన్నారు.

పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధి

ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్‌రూరల్: గ్రామాల అభివృద్ధికి నాయకులు పార్టీలకతీతంగా కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని లింగారెడ్డిగూడలో మురుగు కాలువను ఎమ్మెల్యే నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ నాయకులు గ్రామాల అభివృద్ధిని విస్మరించారని అన్నారు. గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకున్నారే తప్పా సమస్యలు పరిష్కరించింది లేదని విమర్శించారు. కనీసం మురుగు కాలువలను కూడా శుభ్రం చేసి పాపాన పోలేదని మండిపడ్డారు. ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి గ్రామాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. గ్రామంలో మురుగు కాలువ నిర్మాణానికి కావాల్సిన నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రాజు, నాయకులు తిరుపతిరెడ్డి, అశోక్, కృష్ణారెడ్డి, మల్లేష్‌యాదవ్, సురేష్‌గౌడ్, పకీర్‌పాష, రమేశ్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, గణేష్‌యాదవ్, మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడే 'నార్సింగి'లో అవిశ్వాసం

- క్యాంప్ నుంచి తిరిగి వచ్చిన కౌన్సిలర్లు
- 10.30 గంటలకు చైర్‌పర్సన్‌పై 12.30కి వైస్ చైర్మన్‌పై సమావేశాలు
- పోలీసు బందోబస్తు ఏర్పాటు



నార్సింగి మున్సిపల్ కార్యాలయం

మణికొండ: నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస ప్రత్యేక సమావేశాలు ఈ నెల 18న (నేడు) జరగనున్నాయి. రాజేంద్రనగర్ ఆర్‌డీఓ వెంకట్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు చైర్‌పర్సన్ డి. రేఖాయాదగిరి అవిశ్వాసంపై సమావేశం నిర్వహిస్తారు. ఫలితం తర్వాత తిరిగి వైస్ చైర్మన్ జి. వెంకటేశ్‌యాదవ్ అవిశ్వాసంపై మధ్యాహ్నం 12.30 గంటలకు మరో మీటింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కౌన్సిల్ సమావేశం మందిరంలోకి కౌన్సిలర్లకు మాత్రమే అనుమతించనున్నారు. అవిశ్వాస ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

గోవా నుంచి తిరిగి వచ్చిన కౌన్సిలర్లు

నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో అవిశ్వాసం లేఖలపై సంతకాలు చేసిన 12 మంది కౌన్సిలర్లను గోవాలోని క్యాంప్‌లో ఉంచారు. అయితే సోమవారం గోవా ఎయిర్‌పోర్టు నుంచి సిటీకి వెళ్తుండగా కౌన్సిలర్లు ప్రయాణిస్తున్న వాహనానికి రోడ్డు ప్రమాదం జరగడంతో కొందరు గాయపడినట్లు సమాచారం. దాంతో వారు శనివారం ఉదయం నేరుగా సమావేశానికి రావాల్సి ఉండగా గురువారం రాత్రే హైదరాబాద్‌కు చేరుకున్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశం మేరకు అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలోనే హైదరాబాద్‌లో క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. అందులోనే వారు ఉన్నట్టు తెలిసింది.

అవిశ్వాసం లాంఛనమే..

నార్సింగి మున్సిపాలిటీలో మొత్తం 18 మంది సభ్యులు ఉండగా అవిశ్వాసాలు నెగ్గేందుకు అవసరమైన మూడింట రెండో వంతు కౌన్సిలర్లు సంతకాలు చేశారు. వారంతా నేరుగా సమావేశానికి రానున్నారు. అవిశ్వాసం పెట్టిన వారిని మచ్చిక చేసుకునేందుకు బీఆర్‌ఎస్ నుంచి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ వైపు నుంచి ఎలాంటి ప్రయత్నాలు లేకపోవడంతో అవిశ్వాసం నెగ్గే సూచనలే కనిపిస్తున్నాయి. అయితే జాతీయ స్థాయిలో బద్ధ శత్రువులైన కాంగ్రెస్ ప్రవేశపెట్టిన అవిశ్వాసానికి ఇద్దరు బీజేపీ సభ్యులు మద్దతు ఇవ్వడం సర్వత్రా చర్చానీయాంశంగా మారింది. అవిశ్వాసాన్ని ఎదుర్కొంటున్న చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌తో పాటు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు సమావేశాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం.